

వీరాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నేతలు

రైతన్న కోసమే.. ప్రభుత్వం

- వ్యవసాయానికి కదిలిన యంత్రాంగం
- సాగులో మెలకువలపై కరపత్రాలు పంపిణీ
- రైతును రాజును చేయడమే చంద్రబాబు లక్ష్యమన్న ఎమ్మెల్యేలు

పిడుగురాళ్ల, వెల్దుర్తి, నరసరావుపేట రూరల్, నాదెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగులో సమస్యలు ఏమిటి.. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కావాలి.. ప్రభుత్వం నుంచి పథకాలు అందుతున్నాయా.. లేదా.. మీ సాదకబాధకాలు ఏమిటి అని అన్నదాతలను కలిసి స్వయంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం కదిలింది. ప్రభుత్వం ప్రకటించినట్లుగా సోమవారం రైతన్నా.. మీకోసం' కార్యక్రమం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. సచివాలయాల వారీగా ప్రత్యేక బృందాలు రైతులను వారి ఇళ్ల వద్ద కలిసి సీఎం చంద్రబాబు సందేశంతో పాటు సాగులో తీసుకోవాల్సిన మెలకువలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశాయి. పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న.. ఇకపై చేపట్టనున్న చర్యల



రైతన్నా నీకోసం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు

గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు ప్రత్యేకంగా వివరించారు. పిడుగురాళ్ల మండలం వీరాపురంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. సచివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యరపతినేని ప్రారంభించారు. వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మీ కోసం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి రైతులను కలిశారు. నరసరావుపేట మండలం గురవాయిపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, నాదెండ్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు రైతులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందన్నారు. రైతును రాజును చేయడం కోసమే రైతన్న మీ కోసం కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయాన్ని సాంకేతికతకు అనుసంధానం చేసి రైతులకు ఆదాయం చేకూర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, కాలానికి అనుగుణంగా పైర్లను ఎంపిక చేసుకుని సాగు చేపట్టాలని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు రైతులకు సూచించారు.



మాచర్ల : రైతులకు కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్ గనోరే, ఆర్డీవో మధులత

గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాలు.. రూ.2389

- ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేడ్ ఏ రకం ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చెల్లిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్‌గనోరే తెలిపారు. కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులపై భారం లేకుండా ప్రభుత్వమే గోనె సంచులు వినియోగానికి అయ్యే ఖర్చు 40 కిలోల సంచికి రూ.4.74, హమాలీలకు రూ.22.00తో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తుందన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో 8897798430 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సూచనలు, సహాయం కోసం కంట్రోల్‌రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా ఉపాధి కల్పనాధికారి రవీంద్రనాయక్

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో



నియామక పత్రాలు అందజేస్తున్న రవీంద్రనాయక్

క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ హబ్‌లో తరచూ జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం జరిగిన జాబ్ మేళాకు పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కాగా 138 మంది హాజరయ్యారు. వీరిలో 44 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు రవీంద్రనాయక్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులతో కలసి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్ కియా ఇండియా వంటి కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి,వీరాంజనేయులు, కంపెనీ హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలి

రైతులకు ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రావు సూచన

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలని ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకటరావు తెలిపారు. ఉప్పలపాడులో సోమవారం జరిగిన రైతన్నా మీకోసం.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యాన సహాయకులు యాప్‌లో రైతుల వివరాలను పొందుపరిచే విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో అవసరాలకు తగిన ఉద్యాన పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు అందించే దిశగా డ్రిప్ పరికరాలు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. అగ్రిటెక్ ద్వారా రైతులకు కావాల్సిన పరికరాలను రాయితీ ద్వారా అందజేస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రైతుల పంటలకు విలువ పెరిగే మార్గాలను వివరించారు. వారంలోగా రైతు వారీగా యాప్ సర్వేను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఎస్కే.నబిరసూల్, ఉద్యాన అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల పండుగ

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు



- డిప్యూటీ ఎంపీడీవోలుగా 86 మందికి అవకాశం
- స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు కేటాయింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీల పాలనలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. పల్లె వాసులకు మేరుగైన సేవలు అందించేందుకు క్లస్టర్ల స్థానంలో పంచాయతీలకు గ్రేడ్‌లను అమలులోకి తీసుకొచ్చింది. పంచాయతీల్లో కార్యదర్శులు.. సిబ్బంది క్యాడర్‌లో మార్పులు చేసింది. కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారులుగా మార్పు చేసింది. ఆదాయం.. జనాభా ఆధారంగా పంచాయతీలకు కేటాయించిన గ్రేడ్‌ల ప్రకారం అధికార సిబ్బందిని కేటాయిస్తోంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు డిప్యూటి ఎంపీడీవోలను నియమించనుంది. కార్యదర్శులకే డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ప్రమోషన్ పొందిన కార్యదర్శుల జాబితాను పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 86 మంది కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించాయి.


గ్రేడ్‌లు అమల్లోకి వచ్చిన వెంటనే..

గుంటూరు జిల్లాలో అత్యధికంగా కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోల పదోన్నతులు కల్పించారు. 43 మంది కార్యదర్శులకు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. వీరిలో కొందరిని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో నియమించారు. బాపట్ల జిల్లాలో 30 మంది, పల్నాడు జిల్లాలో 13 మంది కార్య దర్శులు డీవై ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పంచాయతీల్లో గ్రేడ్‌ల పాలన అమల్లోకి వచ్చిన వెంటనే పదోన్నతులు పొందిన వారిని పంచాయతీలకు నియమించనున్నారు. పంచాయతీల్లోని జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లలో కొందరిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేశారు. సచివాలయాల్లోని డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గ్రామ ప్రణాళిక సహాయకులుగా నియమించనున్నారు. పంచాయతీల్లో ఐటీ విభాగం ఏర్పాటు చేసి రికార్డుల డిజిటలైజేషన్ చేసే దిశగా పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. 2025-26 ప్యానెల్ సంవత్సరానికి ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద పంచాయతీల్లో పాలనా మార్పులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

ముట్యేషన్ల ప్రక్రియ మారింది

- ఆర్డీవో స్థాయిలోనే తుది నిర్ణయం
- ఇకపై జేసీ వద్దకు ఫైలు వెళ్లాల్సిన పని లేదు
- ప్రభుత్వ నిర్ణయంతో భూ యజమానులకు తప్పిన తిప్పలు

నరసరావుపేట నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూముల మ్యుటేషన్లకు నూతన కార్య ప్రక్రియని రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం విడుదల చేసింది. వెబ్‌ల్యాండ్‌లోని కొన్ని సర్వే నంబర్లలో పట్టా దారు పేర్లను ఇతరులు/మిగులు భూములు/క్లెయిమ్ చేయని భూమిగా పేర్కొంటూ ఎంట్రీలు చేశారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వెబ్ ల్యాండ్‌లో సవరణలు



చేయించుకోలేకపోయారు. ఎప్పు డైతే భూములను విక్రయించడానికి వస్తారో అప్పుడు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. దీనిని సరి చేసుకోవడానికి గ్రామ/వార్డు సచివా లయం మొదలుకుని జాయింట్ కలెక్టర్ స్థాయి వరకు అర్జీ వెళ్లాలి. చివరికి జాయింట్ కలెక్టర్ దానిని పరిశీలించి ఆమోదం తెలి పాక అప్పు డు తహసీల్దార్ లాగిన్‌లో నుంచి వెబ్ ల్యాండ్‌లో కరెక్షన్ చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు వేర్వేరు పనుల్లో బిజీగా ఉంటుండటంతో వీటిని చాలా సందర్భాల్లో పట్టించుకోవడం లేదు. దీని వలన నెలల తరబడి జాప్యం జరుగుతున్నది.

వెబ్‌ల్యాండ్‌లో ఇతరములు అని ఉన్న ఒక సర్వే నంబర్‌లోని సబ్ డివిజన్ నంబర్లు ఉండటాన్ని రైతు క్లెయిమ్ చేయకపోయి అయినా ఉండాలి/ పట్టాదారుడిని గుర్తించకపోయి అయినా ఉండాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వీటి పరిష్కారానికి గ్రామ/వార్డు సచివాలయంలో అర్జీ పెట్టిస్తున్నారు. అది తహసీల్దార్ లాగిన్‌కి వస్తుంది. ఇలాంటి అర్జీల ను పరిశీలించి రీ మార్కులు పొందుపరచాల్సిందిగా వీఆర్‌వోకి తహ సీల్దారు పంపుతున్నారు. ఆ తర్వాత ఆర్ఐ పరిశీలన చేస్తున్నారు. అక్కడి నుంచి తిరిగి తహసీల్దార్‌కు వస్తుంది. అనంతరం ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు ఫైలు వెళుతుంది. జేసీ ఆమోదంతో వెబ్‌ల్యాండ్ ఎంట్రీలలో కరెక్షన్లు చేస్తున్నారు. ఇక నుంచి ఈ ప్రక్రియ ఆర్డీవో స్థాయిలోనే జరుగుతుంది. దరఖాస్తు దారుడు జీఎస్‌డబ్ల్యూఎస్(సచివాలయం)లో మ్యుటేష న్ ఫర్ ట్రాన్సాక్షన్ సర్వీసు కింద అర్జీ పెడతారు. దీనిని వీఆర్‌వోకి సమాచారం ఇస్తారు. ఆ అర్జీని, డాక్యు మెంట్లను వీఆర్‌వో పరిశీలించి తహసీల్దార్‌కు పంపు తారు. దీని ఆధారంగా తహసీల్దార్ ఫారం-8 నోటీసుని రూపొందించి తిరిగి వీఆర్‌వో లాగిన్‌కి పంపుతారు. వీఆర్‌వో ఆ తర్వాత ఎంక్వయిరీ రిపోర్టు, సంబంధిత ఆర్‌వోఆర్ డాక్యుమెంట్స్, ఫారం-8, రిజిష్టర్డ్ డాక్యుమెంట్‌లు, పాత అడంగల్స్, ఎంజాయిమెంట్ సర్వే రిపోర్టు, వాటర్ ట్యాక్స్ పేమెంట్ రశీదు, పక్క భూముల రైతుల ఎంజాయిమెంట్ స్టేట్‌మెంట్‌ని సేకరించి అన్ని పరిశీలన చేసి ఆర్ఐకి పంపుతారు. ఆర్ఐ చెక్‌లిస్టు ప్రకారం అన్ని ఉన్నాయా, లేదా అని పరిశీలించి తహసీల్దార్‌కు రీమార్కులు రాసి నివేది స్తారు. తహసీల్దారు వీఆర్‌వో, ఆర్ఐ రీమార్కులు, డాక్యుమెంట్లను పరిశీలించి సబ్ కలెక్టర్/ఆర్డీవో లాగిన్‌కు పంపుతారు. ఆర్డీవో తన వద్దకు వచ్చిన వీఆర్‌వో, ఆర్ఐ చెక్‌లిస్టులు, డాక్యుమెంట్‌లు, తహసీల్దార్ సిఫార్సులను పరిశీలించి వెబ్‌ల్యాండ్‌లో కరెక్షన్స్‌కి అనుమతిస్తూ తిరిగి తహసీల్దార్‌కు పంపిస్తారు. దీంతో జాయింట్ కలెక్టర్లపై పనిభారం తగ్గడం తో పాటు అర్జీలు కూడా త్వరితగతిన పరిష్కార మౌతాయని భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి స్పష్టం చేశారు.

వాగులు.. వెతలు.. వీడేదెన్నడో?

- ఓ మోస్తరు వర్షాలకే ప్రమాదకరంగా వాగులు
- ప్రవాహంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నాయి.. కానీ వర్షం వస్తే ఆ గ్రామాల నుంచి బయటకు అడుగు పెట్టే అవకాశం ఉండటంలేదు. అత్యవసరంగా వైద్య సహాయం కావాలన్నా ఇబ్బందులే. ఓ మోస్తరు వర్షాలకే ఉధృతంగా ప్రవహించే నీటితో చప్టాల పై రాకపోకలు నిలిచి గ్రామీణులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతు న్నారు. ఇదీ జిల్లాలోని వాగు సమీప గ్రామాల్లోని పరిస్థితి. పాలకులు, అధికారులు ప్రత్యక్షంగా ప్రజల ఇబ్బందులను గమనించినా.. ఎప్పటి కప్పుడు చప్టాల సమస్య నుంచి గట్టెక్కిస్తామనే హామీలతో సరిపెడుతున్నారన్న విమర్శలు



చింతలపాలెం - గోనెపూడి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (పాత చిత్రం)

వస్తున్నాయి. నరసరావుపేట మండలంలో పలు గ్రామాల్లో ప్రవహించే వాగులపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. రోడ్డు ఎత్తు పెరిగి వంతెనలు కుచించుకుపోయాయి. ఓ మోస్తరు వర్షాలకే ఆయా చప్టాలపై వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచి అత్యవసరంగా కూడా ఆయా గ్రామాల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంటుంది. ములకలూరు - పెదరెడ్డిపాలెం, చింతలపూడి - గోనెపూడి, గురవాయపాలెం - గోనెపూడి, ఇక్కుర్రు - మునమాక గ్రామాల మధ్య వాగుల ప్రవాహాలతో చప్టాలపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే విద్యార్థులు, రోగులు, ఆయా గ్రామాల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాలలో ప్రజలకు ఏదైనా సహాయం చేయాలన్నా ఆయా గ్రామాలకు వెళ్లే దారిలేక అత్యవసర సమయాల్లో ప్రభుత్వ సాయం కూడా దక్కడంలేదు. ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు విన్నవించినా ఇంత వరకు నూతన వంతెనల నిర్మాణాలకు మోక్షం లభించడంలేదు.

ఇంటర్‌కు సంకల్పదీక్ష



- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రశ్నపత్రాల కిట్లు
- విద్యార్థుల్ని గ్రూపులుగా విభజించి స్టడీఅవర్స్ నిర్వహణ
- జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలపైనా శిక్షణకు ఏర్పాట్లు

చిలకలూరిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా బోర్డు అధికారులు ప్రత్యేకంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్ బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప దీక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల ఆధ్వర్యంలో 35కి పైగా జూనియర్ కళాశాలలో ఉండగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 190 కళాశాలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు దాదాపు 55,476 మంది, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులు 53,876 మంది ఉన్నారు. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉంటారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇప్పటికే అర్ధసంవత్సరం పరీక్షలు పూర్తిఅయ్యాయి. ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కుల్ని అంచనా వేసి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు ఇచ్చిన ప్రశ్నపత్రాలతో విద్యార్థులకు వారాంత పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల్ని ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు పంపుతున్నారు. అంతేకాకుండా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించారు. ఏ, బీ గ్రేడ్‌లో ఉన్న వారు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటూ చదువులో ముందుండగా సీ, డీ గ్రేడ్ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారని అధ్యాపకులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యక్ష శిక్షణ ఇవ్వడంతో పాటు కొంతమంది అధ్యాపకులు వారిని దత్తత తీసుకుని స్టడీఅవర్స్ నిర్వహించి ప్రత్యేకంగా చదివించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చే ఏడాది జనవరి 21 నుంచే ఎన్విరాన్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది

(మిగతా 6వ పేజీలో)

‘చలపతి ఫార్మసీ’లో ఉద్యోగ మేళా రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

లాం(తాడికొండ) నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 26న బుధవారం ఫైకేర్ సర్వీసెస్ హెల్త్‌కేర్ సంస్థ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైకేర్ సర్వీసెస్ సంస్థలో మెడికల్ కోడింగ్, బిల్లింగ్, హెల్త్‌కేర్ అకౌంటింగ్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్, మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మసీ, నర్సింగ్, బీపీటీ, బి.హెచ్.ఎం.ఎస్ బి.ఎ.ఎం.ఎస్, ఎం.పి.టి విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూనియర్ ప్రాసెస్ అసోసియేట్ అకౌంట్స్‌కు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేషన్‌తో పాటు.. హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా ఉండాలన్నారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెడికల్ బిల్లింగ్‌కు ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేట్లు, హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డిప్లొమా చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతాయని, పూర్తి సమాచారం కోరకు 81062 53172, 97407 55323 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నాగార్జున సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 583.20 అడుగులు ఉంది. ఇది 292.24 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 4,034, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 15,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 15,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 5,668 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 3,600, లీకుల ద్వారా 400, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు

● సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ



వరి పంటను పరిశీలిస్తున్న చైర్మన్ ధూళిపాళ్ళ

పొన్నూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు కృషి చేస్తున్నామని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని జడవల్లి, బాపట్ల జిల్లాలోని సంగుపాలెం కోడూరు గ్రామాల మధ్య సంగం సీడ్ ప్రాజెక్టు ద్వారా సాగైనా వరి పంటను సోమవారం చైర్మన్ నరేంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం అర్జున్ ఎస్ఎస్ ఆర్ ఫోర్ వరి రైతులకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా ఉందన్నారు. ప్రతికూల వాతావరణం తట్టుకొని మేలైన దిగుబడులు ఇచ్చే విత్తనాలను సంగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే షుగర్ పేషెంట్లను దృష్టిలో పెట్టుకొని అర్జున్ ఆరోగ్య పేరుతో విత్తనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. పురుగు మందులు తక్కువగా వినియోగించి రైతుకు సాగు వ్యయాన్ని తగ్గించేలా తమ విత్తనోత్పత్తి ప్రాజెక్టు పని చేస్తుందన్నారు. ఎస్ఎస్ఆర్ ఫోర్ అనే విత్తనం గేమ్ చేంజర్ కాబోతుందన్నారు. అలాగే సంగం రుద్రా పేరుతో అధిక దిగుబడులు ఇచ్చే టమాటా విత్తనాలను మార్కెట్లోకి తీసుకొచ్చామని.. ఈ విత్తనాలు రాయలసీమ ప్రాంతంతో పాటు కర్ణాటక లోని రైతులకు మంచి దిగుబడులు ఇస్తున్నాయని చెప్పారు. సంగం వీర పేరుతో మినుము విత్తనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నామన్నారు. డెయిరీ ద్వారా పాడిని లాభసాటిగా చేయడంతో పాటు.. పంటను కూడా లాభసాటిగా తెచ్చేందుకు తమ శాస్త్రవేత్తల బృందం పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ, సీడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో డిఎస్‌డివో అఫ్రోజ్ ఖాన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

ఏఎన్‌యూ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జిల్లా అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో జరుగుతున్న ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ ప్రారంభించి, ప్రసంగించారు. క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇటువంటి లీగ్‌లతో బాలికలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మంగళగిరి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని ఇస్తాయన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదు మాట్లాడుతూ అండర్ 14, 16 బాలికల పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుడు కె.కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ జి.శేషయ్య, కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వర్లు కె.రవి, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైకుంఠపురంలో ఎమ్మెల్యే ప్రవీణ్‌కు వినతుల వెల్లువ



అదనపు తరగతి గదుల కోసం వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులతో మమేకమై..

అమరావతి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టిన.. వంద రోజులు వంద గ్రామాల పర్యటన రెండవ రోజు సోమవారం మండల పరిధిలోని వైకుంఠ పురంలో విజయవంతంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రవీణ్ ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. రోడ్డు ఆక్రమించారని, విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, కరకట్ట పటిష్టం చేయాలని, మంచినీటి సదుపాయం కల్పించాలని ఇలా.. ప్రజల నుంచి 35 అర్జీలు వచ్చాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ, జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి సౌకర్యాలను తెలుసుకున్నారు. హైస్కూల్ విద్యార్థులతో మమేకమై వేమన శతకం పద్యాల అర్థాలను అడుగుతూ వారికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ పార్వతి, ఏఓ అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈ కిరణ్, ఎంఈఓలు ప్రసాద్, శివబాబు, పెదమద్దూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ భావన సూర్యనారాయణ, సర్పంచ్ విఠల్‌రావు, ఎంపీటీసీ కె.రాజు, బి.నాగేశ్వర రావు, శేషుబాబు, బి.రవి టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజా, బీజేపీ నాయకులు ఎ.సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చిరుమామిళ్ల



మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుబాబు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన చిరుమామిళ్ల మధుబాబు సోమవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి మధుబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఉన్నం లక్ష్మీనారాయణ, కర్నా అమర సైదారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

డీఎస్పీల జంటకు.. శుభాకాంక్షలు



డీఎస్పీలు జగదీష్, విద్యాశ్రీ వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. వీరి వివాహ రిసెప్షన్ సోమవారం రాత్రి గురజాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు, జూలకంటి బ్రహ్మానం దరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ బి.కృష్ణారావు హాజరయ్యి.. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. జేసీ సూరజ్, డీఆర్వో మురళి, విద్యుత్తు శాఖ ఎస్ఈ పి.విజయకుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ, పలువురు జిల్లా అధికారులు, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు. - పిడుగురాళ్ల

ఇంటర్‌కు.. ‘సంకల్ప దీక్ష’

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ప్రణాళికా బద్ధంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేలా ఇంటర్ బోర్డు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే డిసెంబరు మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి అవుతుందని ఇంటర్ బోర్డు ఆర్ఐఒ గన్నెపూడి సునీత ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ తర్వాత మరింత పకడ్బందీ ప్రణాళికతో విద్యార్థుల్ని పరీక్షలకు సిద్ధం చేస్తామని, ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లా అత్యున్నత ఫలితాలు సాధించేలా అధ్యాపకుల సహకారంతో సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా మెటీరియల్ పంపిణీ చేసినట్లు ఆర్ఐఒ చెప్పారు. ప్రతిరోజు ఇందుకోసం ప్రత్యేకంగా టైమ్‌టేబుల్ నిర్దేశించి శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ నిర్మూలనే ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యం

జిల్లా ఉపాధి కల్పన అధికారి రవీంద్ర నాయక్



నియామక పత్రం అందజేస్తున్న రవీంద్ర నాయక్

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ నిర్మూలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రవీంద్ర నాయక్ అన్నారు. సోమవారం సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 138 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 44 మంది వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైనట్లు రవీంద్ర నాయక్ తెలిపారు. అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులతో కలసి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఫ్యూచర్ ఐటీ సొల్యూషన్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్ కియా ఇండియా కంపెనీల హెచ్ఆర్‌లు, కళాశాల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సీబీఎన్ కాలనీలో..
కార్డెన్ సెర్చ్

నరసరావుపేట లీగల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు నర్సారావుపేట డీఎస్పీ ఎం.హనుమంత రావు ఆధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డులో గల చంద్రబాబునాయుడు కాలనీలో సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నలుగురు సీఐలు, ఎస్సైలు ఏఎస్ఐలు సిబ్బంది మొత్తం వంద మంది పాల్గొన్నారు. సరైన అనుమతి పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. రెండు గంజాయి కేంద్రాలను, ఒక పేకాట స్థావరానికి సంబంధించి సమాచారం లభించింది అన్నారు. పట్టణ సీఐలు ఫిరోజ్, ప్రభాకర్ రావు, వినుకొండ సీఐలు బి.ప్రభాకర్, బ్రహ్మయ్య, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

35,077 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 37,422 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,679 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11500	14000
334	10000	18200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11500	16000	334	10000	17800
273	---	---	నెంబరు. 5	11500	16500
341	10000	17200	341	11500	18000
4884	---	----	4884	---	----
సూపర్ 10	11500	16000	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15500	తేజ	11000	15600
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18200
బ్యాడిగి	11000	18000	దేవనూరు డీలక్స్	10500	17200
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8500

ఖాతాలో..
రూ.72 వేల నగదు మాయం

ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన ఘటన సోమవారం వెలుగు చూసింది. మండలంలోని వనికుంట గ్రామానికి చెందిన కనగాని శ్రీను ఈపూరు యూనియన్ బ్యాంకులోని తన బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయలు దాచుకున్నాడు. ఈ నెల 14 నుంచి దశల వారీగా అతని ఖాతా నగదు మాయమైంది. బాధితుడు అన్నదాత సుఖీభవ నగదు ఖాతాలో పడిందో లేదో చూసుకునేందుకు.. సోమవారం యూనియన్ బ్యాంక్‌కు వచ్చాడు. అతని ఖాతాను పరిశీలించిన బ్యాంక్ అధికారులు రూ.36 వేలు నగదు మాత్రమే ఉందని తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన శ్రీను తన ఖాతాలో సుమారు లక్ష రూపాయలు ఉండాలని చెప్పగా.. అధికారులు ఖాతాను క్షుణ్ణంగా పరిశీలించారు. మధ్యప్రదేశ్ నుంచి ఆధార్ కార్డు సాయంతో శ్రీను ఖాతాలోని నగదును డ్రా చేసినట్లు గుర్తించారు. ఇది సైబర్ నేరస్తుల పని అని బ్యాంక్ అధికారులు శ్రీనుకు తెలియజేశారు. కొడుకు ఆరోగ్యం బాగలేకపోవడంతో.. ఆసుపత్రిలో ఖర్చులకు అప్పులు చేశానని.. తన భూమిని అమ్మి వచ్చిన నగదుతో బాకీల తీర్చానని బాధితుడు తెలిపారు. మిగిలిన లక్ష రూపాయలు బ్యాంకు ఖాతాలో దాచుకుంటే.. దోచుకున్నారంటూ వాపోయా డు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

నరసరావుపేటలో దారుణ హత్య



మృతుడు షేక్ బాజీ

నరసరావు పేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేశాను పల్లి పంచాయతీ పరిధిలోని ఎల్‌టీ నగర్ వద్ద ఆదివారం రాత్రి దారుణ హత్య జరిగింది. రూరల్ ఎస్ఐ కిషోర్ వివరాల మేరకు.. పట్టణంలోని కొండలరావు పేటకు చెందిన షేక్ బాజీ (34)పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బాజీని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెనాలి - విజయవాడ మార్గంలో దుగ్గిరాల స్టేషన్ వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సోమవారం వివరాలు వెల్లడించారు. మూడో నంబరు ట్రాక్‌పై మృతదేహం పడి ఉందన్న సమాచారంతో ఉదయం వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. విచారణలో దుగ్గిరాల పెద అగ్రహారానికి చెందిన దారా సుధీర్‌కుమార్ (42) రైలు ఢీకొని మృతి చెందినట్లు గుర్తించినట్లు చెప్పారు. మృతుడు ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి..

చేబ్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య సోమవారం ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మంచాల గ్రామానికి చెందిన వల్లభదాసు మోహనరావు (58) బుడంపాడు నుంచి చేబ్రోలు వైపు ట్రాక్టరులో ప్రయాణిస్తున్న సమయంలో జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేబ్రోలు ఎస్ఐ వీరనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు బహిరంగ వేలం పాటలు

మాచర్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతలలో వేంచేసియున్న రంగనాయకస్వామి ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్, దేవతామూర్తుల చిత్రపటాలు, వాటర్ బాటిల్స్ అమ్ముకునే హక్కులకు మంగళవారం మాచర్ల పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నారు. ఈ హక్కు ఏడాదిపాటు వర్తించనుంది.

నేడు రెంటచింతలలో రైతన్నా మీ కోసం..

రెంటచింతల,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యంలో మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బి రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మానందరెడ్డి హాజరౌతారన్నారు.

నేడు జలాలపురం గ్రామానికి ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రవీణ్ మంగళవారం మండలంలోని జలాలపురం రానున్నారని గ్రామ మాజీ సర్పంచ్ పాటిబండ్ల అర్లయ్య సోమవారం తెలిపారు. ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటిస్తారన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం

కారంపూడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మి, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి ఉత్సవాలు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలోని షిర్డీసాయి సత్యసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి సత్యసాయి చిత్రపటంతో ఊరేగింపు జరిపారు. పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

మాచర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణ పడడంతో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని లింగాపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జింకల నాగేశ్వరరావు, రాగి నాగేశ్వరరావు పూటుగా మద్యం సేవించి ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలు కాగా బంధువులు మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స నందిస్తున్నారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని పశువుల కాపరికి గాయాలు

మాచర్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో పశువుల కాపరికి గాయాలైన సంఘటన మండలంలోని కంభంపాడులో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన రమణమ్మ పొలం నుంచి పశువులను తోలుకొని ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో కారు ఢీకొంది. ప్రమాదంలో రమణమ్మ తలకు, కాలికి గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.1.93 కోట్లు విడుదల

రెంటచింతల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి నాపరాయి క్వారీ కార్మికులు వైద్యపరంగా ఎదుర్కొంటున్న ఇక్కట్లు తొలిగించేందుకు గోలిలో పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.1.93 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలియజేశారు. పీహెచ్‌సీ సమస్యను వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తాను పలుమార్లు తీసుకెళ్లి వివరించినందువల్లే నిధులు మంజూరైనట్లు చెప్పారు. పీహెచ్‌సీకి కేటాయించిన ఎకరమున్నర స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు కేటాయించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నట్లు తెలిపారు. వైద్యఆరోగ్య, రెవెన్యూ అధికారులు వారం వ్యవధిలో స్థలం అప్పగింత ప్రక్రియను పూర్తి చేస్తే ఫలితం సానుకూలంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చొరవతో తమ ప్రాంత చిరకాల స్వప్నం నేరవేరనుందని టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

పిడుగురాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీను మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం వేతన కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం లేబర్ కోడ్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించాలి

సత్తెనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న పురపాలక సంఘ ఎన్నికల్లో మునిసిపల్ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని లోక్ జనశక్తి పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జనాభా దామాషా ప్రకారం దళితులకు ఇప్పటికే రెండుసార్లు చైర్మన్ అవకాశం రావాల్సి ఉందన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలి

పెదకూరపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య నిర్మిస్తున్న సెల్‌టవర్‌ను వెంటనే నిలిపివేయాలని పెదకూరపాడులోని గ్రామస్థులు తహసీల్దార్ నీలి ధనలక్ష్మికి, ఎంపీడీవో సాయిలీలకు వినతి పత్రాన్ని అందించారు. పెదకూరపాడులోని ఆర్‌సీఎం స్కూల్ సమీపంలో జరుగుతున్న సెల్ టవర్ నిర్మాణ పనులు పూర్తయితే రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో చెన్నుపాటి బుల్లిబాబు, తూమాటి బసవయ్య, చలపతిరావు, రవి, నెలకుదిటి గిరి ప్రసాదు, కూరపాటి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలి

బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరు సహకరించాలని గుడ్‌షెఫర్డ్ సంస్థ మిషన్ డెవలప్‌మెంట్ అధికారి సంజయ్ బరాయి కోరారు. మండలంలోని 75 తాళ్ళూరులో సోమవారం బాలల హక్కుల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ ఆంటో మాట్లాడుతూ, బాలల పార్లమెంట్ ఏర్పాటుచేసి చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ చెడు అలవాట్లకు దూరంగా ఉం డేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తండు లక్ష్మణ్, సిస్టర్ స్మిత, బాబు, పవన్‌కుమార్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాచవరం ఎంపీపీ కన్నుమూత

మాచవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాచవరం మండల ఎంపీపీ దారం అమ్ములమ్మ (80) సోమవారం కన్నుమూశారు. 2022లో మోర్జంపాడు నుంచి ఎంపీటీసీగా గెలుపొంది మాచవరం మండల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎంపీపీ అమ్ములమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కాసు వెంట మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


అమ్ములమ్మ (ఫైల్)

వ్యవసాయానికి పండుగ రోజులు

● ఎమ్మెల్యే యరపతినేని


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, పక్కన అధికారులు, కూటమి నేతలు

పిడుగురాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం వీరాపురంలో నిర్వహించారు. అన్నదాత కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అందుతున్నాయో లేదో రైతుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకొని చంద్రబాబు అందించిన లేఖలను వారికి అందించారు. వీరాపురం ఆదర్శ గ్రామమని, సాగునీటి కోసం ఆనాడు తనతో కలిసి ఎన్‌టీఆర్ వద్దకే వెళ్లి పోరాడి మూసేసిన సాగర్ గేట్లను తెరిపించుకున్న ఘనత ఇక్కడి రైతులదని గుర్తుచేశారు. రాష్ట్రంలో వ్యవసాయానికి పండుగ రోజులు వచ్చాయన్నారు. వచ్చే నెలలో గురజాల నియోజకవర్గానికి చెందిన కొంతమంది రైతులను వ్యవసాయంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోన్న తెలంగాణలోని ములకలూరు గ్రామ సందర్శనకు తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం సచివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తురకా వీరస్వామి, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మధుబాబు, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో సంధ్యారాణి, పిల్లి చెన్నారావు, జంపని శ్రీనివాసరావు, పర్వతనేని రామారావు, కడియాల రామారావు, యడ్లపల్లి శివ, మాజీ ఎంపీపీ నారాయణ, వున్నం సురేష్, శ్రీను, కూరపాటి కొండలు, ముప్పాళ్ల సాంబయ్య, బూదెయ్య, కృష్ణమూర్తి, గుదె నాగసతీష్‌బాబు, ఈదర అనురాధ, రావి రమణ, గౌర సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి


ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పి.కిరణ్

సత్తెనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌లకు వివిధ కేసుల్లో వచ్చిన ఫిర్యాదుదారులైన బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పి.కిరణ్ సిబ్బందిని ఆదేశించారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు పోలీసుస్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లపై కూడా దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నకరికల్లు పోలీసు స్టేషన్‌లో గత నెలలో 35 మోటారు సైకిళ్ళు, గంజాయి పట్టుకున్న కేసుల్లో ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుళ్ల కేకేఎస్ నారాయణ, కె.శ్రీను, కానిస్టేబుళ్ళు ఎస్‌కేఎం సుభానీ, కె.జ్ఞానయ్య, రాజుపాలెం హెడ్ కానిస్టేబుల్ హసనేల్‌కు బహుమతులిచ్చి అభినందించారు. సమావేశంలో నకరికల్లు, ముప్పాళ్ళ రాజుపాలెం ఎస్‌ఐలు కె.సతీష్, పి.అనీల్ కుమార్, సీహెచ్ మణికృష్ణ ఉన్నారు.


అవార్డు అందుకుంటున్న పిడుగురాళ్ల ఐఎంఏ అధ్యక్షుడు భరత్‌కుమార్

ఐఎంఏ అధ్యక్షుడు భరత్‌కుమార్‌కు మూడు అవార్డులు

పిడుగురాళ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఐఎంఏ శాఖ అధ్యక్షుడు ధూళిపాళ్ల భరత్ కుమార్ మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు. పట్టణ ఐఎంఏ శాఖను అభివృద్ధి చేసి విశేష సేవలందించినందుకు, కొత్త సభ్యత్వ నమోదు సాధించినందుకు, పిడుగురాళ్లలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించినందుకు ఆయనకు ఈ అవార్డులు దక్కాయి. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి, రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు జి.నందకిషోర్, నూతన అధ్యక్షుడు డాక్టర్ సంగారాజు బాలరాజు శని, ఆదివారాలలో అన్నమయ్య జిల్లా రాజంపేటలో నిర్వహించిన 67వ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశంలో భరత్‌కుమార్‌కు అవార్డులను అందజేశారు.

టీచర్ సత్యనారాయణరాజు దంపతులకు ట్రైనర్ సర్టిఫికెట్

సత్తెనపల్లి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.సత్యనారాయణ రాజు, ఆయన భార్య లక్ష్మీ హేమలత ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ద్వారా ఖమ్మంలో 36 రోజుల పాటు శిక్షణ పొంది ట్రైనర్ సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిని హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన కంచేటి శంకరరావుకు రూ. 50,900, కంచేటి సాయి కుమారికి రూ. 1.25 లక్షలు, విప్పల సత్యనారాయణరెడ్డికి రూ. 1.20 లక్షలు మంజూరైనట్టు తెలుగు రైతు నాయకుడు కంచేటి నరసింహారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేలవల్లి భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరాచారవంతుడి మరణం తీరనిలోటు

● పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్


వీరాచారవంతుడు జల నరసింహం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీరాచారవంతుడు జల నరసింహం అకాల మరణం పల్నాడు పీఠానికి తీరని లోటని పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అన్నారు. పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం కల్లిపాడు రోజున కొణతములను నాగులేరులో శుద్ధి చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి జల నరసింహం మృతిచెందారు. గుంటూరులో పోస్టుమార్టం అనంతరం జల నరసింహం భౌతికకాయాన్ని విజయ్‌కుమార్ సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం జలనరసింహం అంత్యక్రియల్లో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

సత్తెనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి వారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు గృహ, పెన్షన్, వైద్యం తదితర సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో కన్నా ఫోన్‌లో మాట్లాడి ఆదేశించారు.

రైతన్నా మీ కోసం.. కరపత్రాల ఆవిష్కరణ


రైతన్నా మీ కోసం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతన్నా మీ కోసం కరపత్రాలను వైకుంఠపురంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆవిష్కరించారు. రైతన్నను రాజును చేయాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన ఐదు సూత్రాల గురించి ప్రతి రైతు వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, ఏవో అహ్మద్, సర్పంచ్ విఠల్‌రావు, ఎంపీటీసీ కె.రాజు, ఈవోపీఆర్డీ పద్మజ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి

● టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం


అచ్చంపేటలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

అచ్చంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీ కోసం కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొని మంచి ప్రభుత్వాన్ని రక్షించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రైతన్నా మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు రైతులను అధికారులు కలసి ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి వివరించి వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ఎస్.నాగమణి, అగ్రికల్చర్ అధికారి షేక్ షరీఫ్, గ్రామ సర్పంచ్ ఎస్‌కే జానీ, క్రోసూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాయిడి సాంబశివుడు, వెనిగండ్ల కోటయ్య, సందెపోగు గాంధీ, చల్లా అనూపకళ, సాంబయ్య, తాళ్ళూరి సుబ్బారావు, తిరువాయిపాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దూడలకు నట్టల నివారణ మందులు వాడాలి


రైతులకు పశువుల మినరల్ మిక్చర్‌ను అందజేస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ సుధాకర్

అచ్చంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా దూడలకు నట్టల నివారణ మందులను ఇవ్వాలని పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ వై.సుధాకర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని క్రోసూరు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.సుధాకర్ మాట్లాడుతూ, శరీర బరువును బట్టి దూడలకు పాలు పట్టాలన్నారు. అనంతరం రైతులకు పశువుల మినరల్ మిక్చర్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శివ సారథిబాబు, డాక్టర్ షేక్ బషీర్, డాక్టర్ సి.మాధవి, డాక్టర్ బి.ప్రతాపరెడ్డి, గోళ్ళమూడి అచ్చయ్య, మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అన్నదాతలు అందిపుచ్చుకొని లాభసాటి వ్యవసాయం చేయాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరరావు అన్నారు. మండలంలోని రెంటపాళ్ళలో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా వీఏఏ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి వీరాంజనేయులు, మక్కపాటి రామచంద్రరరావు రైతుల వద్దకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అందని వారి వివరాలను ప్రభుత్వ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొదమల కోటేశ్వరరావు, ధనేకుల శ్రీనివాసరావు, వడ్లమూడి నారాయణ, జమండ్లమూడి రామారావు, మక్కపాటి వెంకటేశ్వర్లు, నరసింహారావు, చెన్నమల్లు శివ, వ్యవసాయశాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బహ్రెయిన్‌లో జరిగిన యూత్ ఆసియన్ గేమ్స్‌లో భారత యువ కబడ్డీ జట్టు విజయం సాధించటంలో కీలకపాత్ర పోషించిన క్రీడాకారుడు గద్దె హరీష్‌ను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో సత్కరించారు. - సత్తెనపల్లి



రాష్ట్ర భట్రాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సరికొండ వెంకటేశ్వరరాజు సోమవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును గుంటూరులోని ఆయన గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. - సత్తెనపల్లి



రాష్ట్ర భట్రాజు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌ను గుంటూరులోని ఆయన నివాసంలో కలిశారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబును కూడా కలిశారు. - సత్తెనపల్లి





వేదికపై రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సాగుకు సాంకేతికత తోడైతే అద్భుతాలు

● వరికపూడిశెల నిర్మించకుంటే రాజకీయ సన్యాసమే

● రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగుకు సాంకేతికత తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శిరిగిరిపాడులో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి రైతన్నా మీ కోసం కార్యక్రమం ఉద్దేశ్యం, వ్యవసాయంలో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం కోసం సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి అచ్చెంన్నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వ్యవసాయాన్ని సాకేతికతకు అనుసంధానం చేయడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. వరికపూడిశెలను నిర్మించకుంటే రాజకీయ సన్యాసాన్ని తీసుకునేందుకైనా వెనుకాడనని చెప్పారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకులుగా మారిన కీలక అనుమతులను కేంద్రంతో మాట్లాడి ప్రభుత్వం లైన్ క్లియర్ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లీశ్వరి మధుయాదవ్, ఎంపీపీ సంజీవరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్లం రామాంజిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల పాపిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జగదీశ్వర రెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఎంపీడీవో సాంబశివరావు, ప్రసాద్, ఏవో బాలాజీ గంగాధర్, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలధారుల సద్దికి రూ.1.50 లక్షల విరాళం


మాలధారులకు సద్ది వడ్డిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాలధారుల సద్దికి రూ.1.50 లక్షలను విరాళంగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం కమిటి సభ్యులకు అందించారు. పట్టణంలోని నూతనంగా నిర్మితమవుతున్న శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థాన ఆవరణలో మాలధారులకు ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువనేత నిఖిల్ పాల్గొన్నారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సద్ది కార్యక్రమంలో పాల్గొని మాలదారులకు సద్ది వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, శరమాల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన కారంపూడిలో రైతులతో మాట్లాడారు. ఆధునిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, నాగులునాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు బాలవెంకటేశ్వర్లు, కాల్వ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ


గిరిధర్‌కు నియామకపత్రం అందిస్తున్న వెంకటరమణ

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోగినేని వెంకటరమణ పిలుపునిచ్చారు. బీజేపీ కారంపూడి మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కొత్తపల్లి గిరిధర్‌కు సోమవారం కారంపూడిలో నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కజ్జం ఆంజనేయులు, శెట్టి హనుమంతురావు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి నాసరయ్య యాదవ్, దర్శి విజయకుమార్, పువ్వాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిత్యాన్నదాన కార్యక్రమం

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో నూతనంగా నిర్మితమవుతున్న షిరిడీ సాయిబాబా దేవాలయంలో 43 రోజులుగా అయ్యప్ప దీక్షా దారులకు నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమం సోమవారం ముగిసింది. నెలన్నర కాలం మండల దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు భోజన సౌకర్యం కల్పించిన నిర్వాహకులను భక్తులతో పాటు దీక్షదారులు సత్కరించారు. మణికంఠ సేవాసమితి, విశ్వ సాయి ట్రస్ట్, దక్షణామూర్తి ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్కార కార్యక్రమంలో ఆలయ నిర్మాణ సారథి సోము మస్తాన్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వై.విష్ణుమూర్తి, ఇందిరమ్మ శ్రీను, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రీయ వ్యవసాయంతోనే గిట్టుబాటు


నకరికల్లులో కరపత్రాలను ప్రదర్శిస్తున్న రైతులు

నకరికల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని వ్యవసాయ అధికారి కె.దేవదాసు అన్నారు. సోమవారం నకరికల్లులో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వీఏఏ వై.ప్రభాకర్, వెటర్నరీ అసిస్టెంట్ సాయి పరమహంస, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ గోపీ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంత్రి లోకేశ ప్రోత్సాహం

● జీడీసీసీబీ చైర్మన్ మక్కెన



100మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

వినుకొండటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులకు మంత్రి నారా లోకేశ్ ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని లయోలా పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ప్రారం భమయ్యాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం మక్కెన మాట్లాడుతూ ఇటీవల వినుకొండలో నిర్వహించిన అండర్ -17 బాల బాలికల కబడ్డీ పోటీలు గుర్తింపు తెచ్చాయన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించారు. క్రీడా ప్రాంగణాలను నూతనంగా తీర్చిదిద్దడంపై క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి షకీలాబేగం, ఫాదర్ అవినాష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు సురేష్, పద్మావతి, పీఈటీలు వై.వి.చిరంజీవి, రాజు, కొండలు, రాజేష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

రూ.కోట్లు ఖర్చు.. దాహార్తి తీరిస్తే ఒట్టు!

- పాఠశాలల్లో నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు
- ఇన్‌స్టలేషన్ చేయలేక మరమ్మతులకు..
- అందుబాటులోకి తెస్తే..విద్యార్థులకు తాగునీరు

గుంటూరు(విద్య) నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్కడ పేరుకు మాత్రమే వాటర్ ప్లాంట్లు ఉంటాయి. రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినా అందులో నుంచి చుక్క నీరు రాదు. కేవలం ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లించని కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు అలంకార ప్రాయంగా మారిన వైనమిది. గత వైసీపీ పాలనలో నాడు-నేడు పనుల్లో భాగంగా కొనుగోలు చేసిన ఈ ప్లాంట్లు విద్యార్థులకు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయో తెలియక, వాటిని పర్యవేక్షించలేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

ఒక్కో ప్లాంట్ ఖరీదు రూ.లక్షల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశ పనుల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ప్రమేయం లేకుండా ఆరో ప్లాంట్లు కొనుగోలు చేసి ఎన్నికలకు ముందు పాఠశాలలకు తరలించారు. ఒక్కో ప్లాంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖరీదు చేస్తుందని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 100కు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోట్ల వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చిన వెంటనే నిర్దేశించిన ప్రదేశంలో షెడ్డు నిర్మించి.. అక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. అయితే వాటర్ ప్లాంట్ పాఠశాలకు వచ్చి నెలలు గడిచినా షెడ్లు నిర్మించలేదు. కొన్ని నెలల తర్వాత ఆరో ప్లాంట్ల నిర్వహణపై విమర్శలు రావడంతో షెడ్లు నిర్మించి వాటిని పెట్టారు. అయితే విద్యుత్ సరఫరా ఇచ్చి ఇన్‌స్టలేషన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ లోగా ఎన్నికలు రావడం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అనేక పాఠశాలల్లో ఆరో ప్లాంట్లు షెడ్లకే పరిమితమయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చి దాదాపు 19 నెలలు పూర్తయింది. తాజాగా నాడు నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చారు. గత పాలకులు చేసిన తప్పిదాలను మాత్రం సరి చేయడం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్లు

దుమ్ముపట్టి.. దిష్టిబొమ్మల్లా..

గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం, ఎన్జీవో కాలనీలోని ఎస్‌కేబీపీఎం స్కూల్‌తో పాటు 11 మున్సిపల్ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు దుమ్ము పట్టి ఉన్నాయి. ఇలా ఉమ్మడి జిల్లాలోని అనేక జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం వాటర్ ప్లాంట్లు ఉపయోగంలోకి రాక దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు రావడంతో కొన్ని మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల, బ్యాటరీ ఫెయిల్ కావడం, ఫిల్టర్లు పాడైపోవడం, ప్లాంట్‌లో అంతర్గతంగా సాంకేతిక సమస్యలు రావడంతో ఇన్‌స్టలేషన్ చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థలకు ఇన్‌స్టలేషన్ చార్జీలు చెల్లిస్తే ఇవి వినియోగంలోకి వస్తాయని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలని, గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'వేలం'వెర్రిగా నమ్మించి.. రూ.కోటి టోకరా

● సగం ధరకే బంగారం ఇస్తానని మోసం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనో బ్యాంకు ఉద్యోగినని చెప్పుకుంది. బ్యాంకు తాకట్టులోని బంగారం వేలంలో తక్కువ ధరకే వస్తుందని నమ్మించింది. ఆ బంగారాన్ని సగం ధరకే ఇస్తానని తన తండ్రితో కలిసి కోట్ల రూపాయలు వసూలు చేసి.. అటు బంగారం ఇవ్వక.. ఇటు డబ్బులు తిరిగివ్వక మోసం చేసిందని.. ప్రశ్నిస్తే.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసులు పెడతానని బెదిరిస్తోందని బాధితులు ఎస్పీ కార్యాలయానికి సోమవారం క్యూకట్టారు. బాధితుల్లో పెదకాకానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ కూడా ఉన్నారు. బాధితురాలు గుల్జార్ ఫిర్యాదు మేరకు.. తమ ఇంటి సమీపంలో నివాసం ఉండే ఓ మహిళ ద్వారా నంబూరుకు చెందిన మహిళ పరిచయమైందని పేర్కొన్నారు. తను విజయవాడ భవానిపురంలోని ఓ బ్యాంకు బ్రాంచీలో ఉద్యోగం చేస్తుంటానని చెప్పిందన్నారు. తమకు వేలంలో బంగారం తక్కువ ధరకే వస్తుందని, దానిని సగానికి సగం ధరకే ఇస్తానంటూ నమ్మబలికిందన్నారు. ఆమె మాటలు నమ్మి జనవరిలో రూ.3 లక్షల నగదు ఇవ్వగా.. అందుకు గాను రూ.5 లక్షల ఖరీదైన బంగారు ఆభరణాలు ఇచ్చిందన్నారు. దీంతో ఆమె మాటలు నమ్మి ఇంటిని విక్రయించి రూ.20 లక్షలు, బంగారు ఆభరణాలన్నీ అమ్మేసి మరో రూ.20లక్షలు ఇచ్చానని వాపోయారు. దీనికి తోడు ఇంటి పక్కన చుట్టుపక్కల తెలిసిన వారందరితో ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆమెకు కట్టించానన్నారు. అలా చుట్టుపక్కల వారి నుంచి రూ.70 లక్షలు ఇప్పించానని గుల్జారు తెలిపారు. తక్కువ ధరకు బంగారం ఇస్తానన్న మహిళ.. ప్రస్తుతం నంబూరు నుంచి పారిపోయి ఇబ్రహీంపట్నంలో ఉంటోందని చెప్పారు. కొంత మొత్తం నగదు ఆమె తండ్రికి కూడా ఇచ్చామన్నారు. ఆయన ఇబ్రహీంపట్నంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. తాము నగదు కోసం అక్కడికి వెళ్తే.. ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తోందన్నారు. ఇలా నమ్మించి మోసం చేసి.. రూ.1.20 కోట్లు వరకు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గిరిపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం బాటలు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

విజయపురిసౌత్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిపుత్రుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గిరిజన యువత ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థానంలో ఉండడం జగన్‌రెడ్డికి ఇష్టం లేక విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి విదేశి విద్యను కొనసాగిస్తోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన రోడ్లు, సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ఆసరాగా 1962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో రోడ్లు వేయిస్తున్నారన్నారు. స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతుల సొమ్ము స్వాహా



గుంటూరులోని ఎన్‌టీఆర్ సహకార భవన్

- జీడీసీసీ బ్యాంకు శాఖల్లో రూ.కోట్లలో అక్రమాలు
- విచారణ దశలోనే వినుకొండ, గురజాల శాఖల కుంభకోణాలు
- కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ అక్రమాలు
- కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము మేత
- విచారణ పేరుతో సాగదీతపై విమర్శలు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంకు శాఖల్లో అక్రమాలు తవ్వే కొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు దళారులు అడ్డగోలుగా కోట్ల రూపాయలు పోగేసుకు న్నారు. కొన్ని ప్లెడ్జి రుణాలు కాగా మరికొన్ని స్వయం సహాయక సంఘాల పేరుతో నకిలీలు సృష్టించి దండుకొన్నారు. తాజాగా నల్లపాడు బ్రాంచ్‌లో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు రూ.22 కోట్లుపైనే అక్రమాలు జరిగినట్లు తేల్చారు. దీనిపై ఇద్దరు మాజీ సీఈవోల సస్పెన్షన్‌తో పాటు పలువురు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా పరిణామాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ శాఖల్లో అక్ర మాలు చర్చనీ యాంశంగా మా రాయి. నల్లపాడు శాఖలో కుంభకోణం కంటే ముం దుగానే వినుకొండ, గురజాల శాఖల్లోనూ స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) పేరుతో నకిలీ గ్రూపులను సృష్టించి రూ. కోట్లలోనే దోచేసిన వైనంపై ఇప్పటికే విచా రణ జరుగుతున్నట్లు తెలిసింది. అయితే నల్లపాడు శాఖలో అక్రమాలపై వేగంగా చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం.. అంతకంటే ముందుగానే వినుకొండ, గురజాల శాఖల్లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ

సెంట్రల్ బ్యాంకుకు చెందిన కొరిటెపాడు, సిటీ శాఖల్లోనూ రూ.కోట్లలోనే అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులోనూ పెద్దఎత్తున నకిలీ గ్రూపులు సృష్టించి రుణాలు పొందినట్లు తెలిసింది. అంతేగాక వినుకొండ, గురజాలతో పాటు పొన్నూరు, ప్రత్తిపాడు, శాఖల్లోనూ అక్రమాలు ఉన్నాయని, విచారణ పేరుతో దీర్ఘకాలంగా సాగదీస్తున్నారే తప్ప చర్యలలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొందని విమర్శలు ఉన్నాయి.

కురగల్లు పీఏసీఎస్‌లో రైతుల సొమ్ము స్వాహా

మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రైతుల సొమ్మును వారికే తెలియకుండా కొందరు అక్రమార్కులు స్వాహా చేసిన వ్యవహారం ఆ శాఖలో తీవ్ర కలకలం రేకెత్తిస్తోంది. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళగిరి పీఏసీఎస్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే ఏడాది కిందట జరిగిన ఈ అక్రమాలపై విచారణ పేరుతోనే సాగదీస్తున్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులే అక్రమాలలో కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళగిరి సొసైటీలో ఇలా ఉంటే కురగల్లు సొసైటీలో కొందరు ఉద్యోగులే నకిలీ పత్రాలు సృష్టించి సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపైనా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇలా వారి వారి స్థాయిల్లో అక్రమార్కులు రైతుల సొమ్ము స్వాహా చేసి దర్జాగా తిరుగుతున్నారు. విచారణల పేరుతో సాగదీస్తుండ టంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

● నిందితుల్లో ఒకరు మైనర్

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నల్లపాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు.. నల్లపాడు ఎస్ఐ మహేష్‌కుమార్‌కు అందిన పక్కా సమాచారం మేరకు.. ఆయన తన సిబ్బందితో కలిసి పలకలూరు రోడ్డు నుంచి జన్మభూమి నగర్‌కు వెళ్లే రోడ్డులో తనిఖీ చేశారు. గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకరు పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ ఒకటో లైనుకి చెందిన షేక్ ఖాజావలి కాగా, మరొకరు.. అంకమ్మనగర్ ప్రాంతానికి చెందిన పదహారేళ్ల మైనర్ అని తెలిపారు. వారి నుంచి మూడు కిలోల 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. లంబసింగి ప్రాంతం నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకు వచ్చినట్లు నిందితులు చెప్పారని తెలిపారు. వాటిని చిన్నచిన్న ప్యాకెట్లలో ఉంచి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులు తమకు తెలిసిన గోపి అనే వ్యక్తికి గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పరారైన గోపీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిత్రజ్యోతి
SINCE 1965

హేమతో ప్రేమ.. పెళ్లి



బాలీవుడ్‌లోని ఐకానిక్ ప్రేమ జంటల్లో ఒకటిగా ధర్మేంద్ర, హేమమాలిని గుర్తింపు తెచ్చుకున్నారు. 'తూ హసీనా మై జవాన్ తూ' చిత్రంతో రీల్ లైఫ్‌లో మొదలైన వారి అనుబంధం.. రియల్ లైఫ్ వరకూ సాగింది.. మరోవైపు నటులు సంజీవ్ కుమార్, జితేంద్ర హేమమాలిని వెంట పడేవారు. కానీ ఆమె మాత్రం ధర్మేంద్రకే మనసిచ్చారు. 'తూ హసీనా మై జవాన్ తూ' లీడ్ పెయిర్‌గా నటించిన ఈ ఇద్దరూ చిత్రీకరణ పూర్తయ్యే సరికి ప్రేమలో పడ్డారు. 'అయితే ప్రేమలో పడినంత సులభంగా వారి పెళ్లి జరగలేదు. హేమమాలినితో ప్రేమలో పడే సమయానికే ధర్మేంద్రకు ప్రకాశ్‌కౌర్‌తో పెళ్లై నలుగురు సంతానం ఉండేవారు. వారే సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. అలానే అప్పటికే పెళ్లైన వ్యక్తితో జీవితం ఎలా పంచుకుంటావు అని హేమమాలిని తల్లిదండ్రులు ఈ పెళ్లికి ససేమిరా అన్నారు. దాదాపు ఐదేళ్లు ప్రేమించుకున్నాక, వివాహం చేసుకుందాం అనే సమయానికి ప్రకాశ్ కౌర్ విడాకులకు అంగీకరించలేదు. అయినా అన్ని అడ్డంకులు దాటుకుని ప్రేమించుకున్న ఏడేళ్లకు వారు ఏడడుగులు వేశారు. పెళ్లయ్యాక వారికి ఇద్దరు కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ జన్మించారు. వారి వివాహ సమయంలోనూ పలు రూమర్స్ రావడం గమనార్హం. వారి పెళ్లికి హిందూ వివాహ చట్టం ప్రకారం న్యాయపరమైన సమస్యలు రావడంతో 1979లో ధర్మేంద్ర ముస్లింగా మారి హేమమాలినిని పెళ్లి చేసుకున్నారని.. ఇద్దరూ తమ పేర్లను దిలావర్, ఆయేషా బీగా మార్చుకున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయాన్ని చాలా కాలం వరకూ ధర్మేంద్ర ఖండించలేదు. 2004లో ఎలక్షన్లలో పోటీ చేస్తున్నప్పుడు స్పందించి, 'మతం మార్చుకునే అవసరం నాకు లేదు' అని స్పష్టం చేశారు.



బాలీవుడ్ హీ మ్యాన్



ఆ తరం అమ్మాయిలకు ఆయన కలల రాకుమారుడు. 'హీ మ్యాన్' అని నాటి యువతరం ప్రశంసలు అందుకొన్న ధర్మేంద్ర పూర్తి పేరు ధర్మేంద్ర కేవల్ కిషన్ డియోల్. నటుడు, నిర్మాత మాత్రమే కాకుండా రాజకీయ వేత్తగానూ పలువురి ప్రశంసలు అందుకొన్నారు. ఆరున్నర పదుల తన నటజీవితంలో 300కు పైగా చిత్రాల్లో నటించి అందగాడుగా, కమర్షియల్‌గా సక్సెస్ అయిన హీరోగా గుర్తింపు పొందారు. చిత్ర పరిశ్రమలో తనకు గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేకపోయినా నట వారసులే కాదు బయటి నుంచి వచ్చిన వారు కూడా హీరోలుగా రాణించగలరు అని నిరూపించారు ధర్మేంద్ర. తాను హీరోగా పరిశ్రమలో మంచి పొజిషన్ సంపాదించుకోవడమే కాకుండా తన కుటుంబం నుంచి మరికొందరు పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచారు ధర్మేంద్ర. తన కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ కూడా సినిమాల్లో తండ్రి వారసత్వం కొనసాగిస్తున్నారు.

19 ఏళ్లకే పెళ్లి

ధర్మేంద్ర 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని లూథియానా జిల్లా నస్రాలీ గ్రామంలో జన్మించారు. 1952లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 19 ఏళ్లకు ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు. కెరీర్ ఆరంభంలో చిన్న పాత్రల్లో నటించారు ధర్మేంద్ర. ఆయన నటించిన తొలి చిత్రం 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' 1960లో విడుదల అయింది. 'ఆయే మిలన్ కీ బేలా', 'ఫూల్ ఔర్ పత్తర్', 'ఆయే దిన్ బహార్ కే' వంటి చిత్రాలతో 60ల దశకంలోనే ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. 1960-80 మధ్య కాలంలో హీరోగా ఓ వెలుగు వెలిగారు. 'ఆంఖేన్', 'షికార్', 'సావన్ ఝూమ్ కీ', 'బందినీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'జీవన్ మృత్యు', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'రాజా జానీ', 'జుగ్ను', 'యాదోంకి బారాత్', 'దోస్త్', 'షోలే', 'చరస్', 'ధర్మ వీర్' వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. 1973 ఆయన కెరీర్‌లోనే లక్కీ ఇయర్. ఆయన నటించిన ఎనిమిది చిత్రాలు బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. 1987లో వరుసగా ఏడు సూపర్ హిట్స్ అందుకున్నారు ఆయన. ఇవి కాకుండా ఒకే ఏడాది తొమ్మిది హిట్ చిత్రాలు.. ఇలా రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతూ సాటి హీరోలకు అందనంత దూరంగా ఉండేవారు ధర్మేంద్ర. ఇప్పటికీ ఆ రికార్డ్ ధర్మేంద్రకే సొంతం. ఆ రోజుల్లో మూడు, నాలుగు షిఫ్టుల్లో పని చేస్తూ బిజీగా ఉండేవారు.

తొలినాళ్లలో సాఫ్ట్, రొమాంటిక్ చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఆయన.. 1970 నుంచి యాక్షన్ మ్యాన్ అనే ఇమేజ్‌ను సొంతం చేసుకుని షోలే చిత్రంతో స్టార్ స్టేటస్ సంపాదించారు. బలమైన దేహదారుఢ్యంతో ఉండే ఆయన తెరపైన శక్తిమంతమైన యాక్షన్ రోల్స్‌తో అలరించేవారు. పోరాటాలు కూడా డూప్ లేకుండా చేసేవారు. అందుకే ఆయనను 'హీ మ్యాన్', 'యాక్షన్ కింగ్' అని పిలిచేవారు.

బయోపిక్ ఇష్టం లేదు

ధర్మేంద్ర బయోపిక్‌ను తెరకెక్కించడానికి ఆయనను చాలా మంది దర్శకనిర్మాతలు సంప్రదించినా సున్నితంగా తిరస్కరించేవారు. 'నా బయోపిక్ తెరకెక్కిస్తే, అందులో నాలా నటించే నటులు ఎవరూ కనిపించలేదు' అని ఆయన భావించడమే దానిక్కారణం.

అమితాబ్‌కు మాట సాయం



తొలినాళ్లలో ధర్మేంద్రతో అమితాబ్ 'షోలే' చేస్తున్న సమయమది. ఈ చిత్రం షూటింగ్ కోసం ధర్మేంద్రతో పాటు అమితాబ్ కూడా బెంగుళూరులో ఉండాల్సిన పరిస్థితి. అయితే అమితాబ్ బెంగుళూరులో ఉండడంతో బొంబాయిలో చాలా సినిమాల చిత్రీకరణలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని దర్శకుడు రమేశ్ సిప్పీకు చెబితే, 'ధర్మేంద్ర కేవలం మీ కోసం రెండు మూడు సినిమాలు రద్దు చేసుకుని వచ్చారు. ఆయన ఏమైనా అనుకుంటాడేమో.. వెళ్లి అడుగు' అని రమేశ్ సిప్పీ అన్నారు. కానీ అప్పటికే సూపర్‌స్టార్ హోదాలో ఉన్న ఆయనకు ఈ విషయాన్ని చెప్పాలంటేనే సందేహిస్తున్నారు. నిర్మాతల బలవంతం మీద అమితాబ్.. 'మీరు వెళ్లమంటే బొంబాయి వెళ్లి మా నిర్మాతల పని పూర్తి చేస్తాను' అని ధర్మేంద్రను అడిగారు. అయన 'దానికేముంది.. ఇక్కడ పనిలేకపోతే వెళ్లండి.. నాకేం అభ్యంతరం లేదు' అని బదులిచ్చారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

27న మెగా జాబ్ మేళా

నాదెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గణపవరం గ్రామంలోని సీఆర్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ చుండి రంగ నాయకులు, కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌లు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ జాబ్ మేళాకు చిలకలూరిపేట పరిసర ప్రాంత విద్యార్థులు కూడా హాజరు కావాలన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

నరసరావుపేట టౌన్. నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం 2005పై 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకు విస్తృతంగా అవగాన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఇ మురళి, నరసరావుపేట ఆర్డీవో మధులత, సత్తెనపల్లి ఆర్డీవో రమకాంత్‌రెడ్డి, గురుజాల ఆర్డీవో వీ మురళీకృష్ణ, కలెక్టర్ కార్యాలయం ఏవో, తదితరులు పాల్గొన్నారు.

వివాద స్థలం పరిశీలన

నూజెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత నాగిరెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంతో మురుగు నీరు నిలిచి ఉండి స్థలాన్ని ఎంపీడీవో పీ ఉమాదేవి సోమవారం పరిశీలించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గ్రామంలో పర్యటించి మురుగు నీరు కాలువలను జేసీబీతో పూడిక తీసి సోఫిట్ నిర్మాణానికి సూచనలు చేశారు.

నేడు అన్నవరంలో వైద్య శిబిరం

రొంపిచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు గ్రామ టీడీపీ నాయకులు పచ్చవ కోటేశ్వర రావు సోమవారం తెలిపారు. కాటూరి మెడికల్ కళాశాల వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు.

స్వర్ణ కుటీరానికి భక్తుల విరాళం

వినుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండమెట్ల వద్ద ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమంలో స్వర్ణ కుటీర భూమి పూజ కార్యక్రమం జరిగింది. న్యాయవాది పొట్లూరి సైదారావు పాల్గొని శంకుస్థాపన చేశారు. స్వర్ణ కుటీర నిర్మాణానికి దాతలు గాండ్ల. నాగేంద్రుడు, ఆయన సతీమణి సామ్రాజ్యం, తిరువాయి పాటి నరసింహా రావు, ఆయన సతీమణి సరోజిని, చిలుకూరి సురేష్ కుమార్, ఆయన సతీమణి లక్ష్మీప్రజా (దుబాయ్), తీరువాయిపాటి సత్యనారాయణ, ఆయన సతీమణి అంజినీ దేవి, ఆత్కూరి కామేశ్వరరావులు ఒకొక్కరు రూ.1.08లక్షలను విరాళాలు ప్రకటించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు మేలిశెట్టి ఉషారాణి, ఏటుకూరి కృష్ణవేణి, విడతల రమ, కాకుమాను రామారావు, భక్త బృందం పాల్గొన్నారు.

కబడ్డీ స్టేట్ మీట్‌కి వాగ్దేవి విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ అండర్-17 స్టేట్ మీట్‌కి వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి నక్కా అనిల్ కుమార్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 19న ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సెలక్షన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడన్నారు. కర్నూల్‌లో జరగబోయే స్టేట్ మీట్‌కి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. నక్కా అనిల్ కుమార్‌ను కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్చుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు అభినందించారు.

క్లుప్తంగా...

● శావల్యాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని రైజింగ్ స్టార్స్‌కు ఉపాధ్యాయులు మంచి బోధనను అందించి వారిని షైనింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు తెలిపారు. శావల్యాపురంలోని మోడల్ పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట నుంచి శ్రీశైలంకు వీలైనంత త్వరలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపోను ఆయన సోమవారం సందర్శించిన సందర్భంగా బీజేపీ ఈ విషయంపై ఆయనకు ఒక వినతి పత్రం సమర్పించారు.

● చిలకలూరిపేట: మండలంలోని గోవిందపురంనకు చెందిన సిద్ధాంతి సిద్దు మారుతాచార్యులు తెలుగు వెలుగు సాహితీ వేదిక వారి జాతీయ స్థాయి నంది అవార్డు, ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందుకున్నారు. సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ భవన్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, అయ్యన్నపాలెం, పమిడిపాడు, మేళ్ళవాగు తదితర గ్రామాల్లో మాజీ ఎంపీపీ తుమ్మా రామిరెడ్డి వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

● నరసరావుపేట టౌన్: ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చీరాల బెటాలియన్ హవల్దార్ మేజర్ రమేష్, హవల్దార్ షంషేర్ సింగ్, బీఎస్ఆర్‌కే రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఎన్‌సీసీ ఆఫసర్ జాజుల శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు. డీఎస్పీని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య ఘనంగా సత్కరించారు.

కాలానికి అనుగుణంగా సాగు చేయాలి



రైతుకు ముఖ్యమంత్రి రాసిన లేఖను అందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆహారపు అలవాట్లు, కాలానికి అనుగుణంగా రైతులు పైర్లను ఎంపిక చేసుకొని సాగు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మండల కేంద్రమైన నాదెండ్లలో సోమవారం రైతన్నా.. నీ కోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల ఇళ్ళకు వెళ్ళి ప్రభుత్వం అమలు చేయనున్న నూతన సాగు విధానంతో పాటు రైతాంగానికి ముఖ్యమంత్రి రాసిన లేఖను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేసిన వ్యక్తిగా రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. సరికొత్త విధానాలతో కొత్త పంటలను సాగు చేస్తే దిగుబడితో పాటు లాభాలను రైతులు సాధిస్తారన్నారు. పండించిన ఉత్పత్తులను రైతులే స్వయంగా ఫుడ్‌ప్రాసెసింగ్ చేయటం ద్వారా మరిన్ని లాభాలు సాధించవచ్చన్నారు. ప్రాసెసింగ్ వ్యవస్థను రాష్ట్ర రైతాంగానికి పరిచయం చేయాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, జనసేన ఇన్‌చార్జ్ తోట రాజ రమేష్, తహశీల్దార్ కుటుంబరావు, ఎంపీడీవో స్వరూపరాణి, నాయకులు సదాశివరావు, సత్యనారాయణ, హరిబాబు, వీరారెడ్డి, నాగ పూర్ణచంద్రరరావు, నాగేశ్వరరావు, నారాయణ, మదన్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15శాతం వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. చెంఘీజ్‌ఖాన్‌పేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఏవో మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు మద్దతు ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ నెల 24 నుంచి 29వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని రైతులందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● వినుకొండ టౌన్: వినుకొండ మండలంలోని కొప్పుకొండ రైతు సేవా కేంద్రం పరిధిలోని చౌటపాలెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ రాఘవయ్య, రైతు సేవకేంద్ర సిబ్బంది, రైతు సోదరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్ల, పాత ఉప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్, టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, బత్తుల గోవిందరాజులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం గురవాయిపాలెంలో రైతన్న సేవలో మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా 46.85లక్షల మందికి పెట్టుబడి సాయం అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● శావల్యాపురం: రైతన్న మీ కోసం కార్యక్రమం ద్వారా రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలు గ్రామాల్లో ఇంటింటి సర్వేని నిర్వహించి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు తెలిపారు. శావల్యాపురం, పోట్లూరు గ్రామాల్లో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఏవో పాల్గొని రైతులకు కరపత్రాలను అందజేసి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మీదుర్గ, ఐసీఆర్పీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్లలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి శివలలిత ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్ అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి 122 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ ఆర్డీవోలు, జిల్లా అధికారులు ఒకటి, రెండు అర్జీలను స్వయంగా తనిఖీ చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి అధికారులు కలెక్టరేట్ నుంచి ఏ అర్జీ వచ్చినా వ్యక్తిగతంగా పరిశీలన చేసి పరిష్కరించాలని, వ్యక్తిగత పరిశీలనకు వెళ్లకుండా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలని వినతి

వినుకొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాధవ ఆస్పత్రిలో వైద్యం వికటించి మృతి చెందిన సంఘటనపై యాదగిరి లక్ష్మి కుటుంబసభ్యులు ప్రజాసంఘాలు సోమవారం నరసరావుపేటలో ఇన్‌చార్జ్ కలెక్టర్ సూరజ్‌కు, డీఎంఅండ్‌హెచ్‌వో రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణానికి కారకులైన వైద్యులపై చర్యలు తీసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రూ.7.18 కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన



టిడ్కో కాలనీలో మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువు రోడ్డులో రెండో దశలో నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయంలో రూ.7.18 కోట్లతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, తాగునీటి వసతి సౌకర్యం కల్పిస్తారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో తొలిదశలో పూర్తిచేసిన టిడ్కో ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని, మార్చినాటికి రెండోదశలో 1,008 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసిన ఈ గృహాలకు వైసీపీ హయాంలో పునాదుల దశ కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. పనుల నిర్వహణ, నాణ్యతలో ప్రభుత్వ మార్గదర్శకాలను విధిగా అమలుచేయాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థదేనని, సంస్థ ప్రతినిధులు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఇప్పటికే లబ్ధిదారులు నివాసముంటున్న టిడ్కో గృహ సముదాయంలో తలెత్తే చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి నివాసముండేవారే కమిటీలుగా ఏర్పడి తమ ఇబ్బందుల్ని అధిగమించడంపై దృష్టి పెట్టాలని, ఆ దిశగా అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గ్లోబల్ లీడర్ షిప్ సదస్సులో పాల్గొన్న డాక్టర్ చెరిన్ కిమ్, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు

ఏఎంరెడ్డిలో గ్లోబల్ లీడర్స్‌పై సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో ఎక్స్‌పర్ట్ టాక్ ఆన్ మెంటల్ ఫోకస్ అండ్ డిసిప్లిన్ టూ బీ గ్లోబల్ లీడర్స్ అంశంపై సోమవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన అమెరికా బోస్టన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చెరిన్ కిమ్ విద్యార్థులలో మానసిక కేంద్రీకరణ, నియమం, కృషి, గ్లోబల్ లీడర్‌షిప్ లక్షణాల ప్రాధాన్యాన్ని వివరించారు. డాక్టర్ చెరిన్ కిమ్‌ను కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి, ఫార్మసీ, ఇంజనీరింగ్, డిప్లొమో ప్రిన్సిపాల్స్ డాక్టర్ పీ భార్గవభూషణరావు, డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డాక్టర్ కే కృష్ణారెడ్డి, సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

ఈజీ మార్టు నుంచి చౌకధరల దుకాణాలకు నిత్యావసరాలు

● ఆర్డీవో మధులత



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో చౌకధరల దుకాణాలకు ఈజీ మార్ట్ ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆర్డీవో మధులత తెలిపారు.. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు పంపిణీ చేయడంతో పాటు, డీలర్లకు అదనపు ఆదాయం కలిగించడం కోసం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈజీ మార్ట్ ప్రతినిధులు, సివిల్ సప్లైస్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో దంత వైద్యశిబిరం

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం సోమవారం జరిగింది. ఎండీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ సయ్యద్ రహమతుల్లా, డాక్టర్ జఫ్రీ ఇమాంబీలా వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు, మౌత్ వాష్, టూత్ పేస్టులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ఇంటర్‌నేషనల్ 3150 పీడీజీ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ కరీమ్ మొహిద్దీన్, డైరెక్టర్లు ఎస్ఏ జిలానీ మాలిక్, మేళ్లచెరువు సుమిత్రకుమార్, మురారిశెట్టి వెంకటేశ్వరరావు, లింగ ఆంజనేయులు, పాఠశాల హెచ్ఎం టీ రవికాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శానిటేషన్ డ్రైవ్

● పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ, కార్మికులు


నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో సోమవారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలురు, బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ఏర్పాట్లుశరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శానిటేషన్ డ్రైవ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్‌ను మున్సిపల్ సిబ్బందితో పాటు ఎమ్మెల్యే కూటమి నాయకలు చీపరుపట్టి శుభ్రం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులకు వేదికగా నిలవనున్నస్టేడియం ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం అవుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, టీడీపీ మైనారిటి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మాబు కూటమి నాయకులు పాల్గొన్నారు.

భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం

రొంపిచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మన్‌గా సరికొండ వెంకటేశ్వరరాజు నియామకంపై ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సరికొండ తిమ్మరాజు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అందరితో కలసి మెలసి ఉండే వ్యక్తికి ఈ పదవి ఇవ్వటం సంతోషించదగ్గ విషయం అన్నారు. కులంలో పేదలను, ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారికి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ పథకాలను అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఉపాధికి శిక్షణ

● పల్నాడు జిల్లా డైరెక్టర్ నీలోఫర్



రావిపాడులో మహిళలకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే లక్ష్యంగా మహిళల ఉపాధికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ బ్యాంకు ద్వారా శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా డైరెక్టర్ ఆర్.నీలోఫర్ తెలిపారు. యూనియన్ బ్యాంకు సోషల్ డెవలప్‌మెంటు ట్రస్ట్, యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు నాబార్డు, డీఆర్‌డీఏ, ఇతర ప్రభుత్వ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నామని నీలోఫర్ తెలిపారు. పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 5 బ్యాచ్‌ల ద్వారా 160 మందికి ఉచితంగా శిక్షణ అందించామని, నవంబరు 24 నుండి 6,7వ బ్యాచ్‌లను ప్రారంభించామన్నారు. సోమవారం నుంచి మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ, బ్యూటీషన్ కోర్సులపై శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కుట్టుమిషన్ నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్న మహిళలు, బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకోవాలన్న మహిళలు తమ పేర్లను రిజిష్టరు చేసుకోవాలన్నారు. ఆసక్తి కల మహిళలు నరసరావుపేట మండల రావిపాడులోని శిక్షణ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. శిక్షణ తరగతులు ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని నిరుద్యోగ, యువతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి 111 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కృష్ణారావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 111 ఫిర్యాదులు అందాయి. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.



ధూపాటి శ్రావణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ కబడ్డీ పోటీలకు కమిటీ హైస్కూల్ విద్యార్థిని ఎంపిక

నూజెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం శ్రీవెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్ పూర్వ విద్యార్థిని ధూపాటి శ్రావణి జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-19 విభాగంలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం శ్రావణిని ఘనంగా సన్మానించారు. శ్రావణికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్ రవిచంద్ర, పాఠశాల హెచ్ఎం ఎస్ కామేశ్వరరావు, పీఎస్ఆర్‌కే ప్రసాదు, కే భారతీరాణి, పీఈటీ గార్లపాటి విజయ, సురేకర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు సమీర ఎంపిక



విద్యార్థిని ఆకుమల్ల సమీర

వినుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 44వ సౌత్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ మహిళల ఛాంపియన్ షిప్ పోటీలకు వినుకొండలోని రాధా డిగ్రీ కాలేజ్‌లో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఆకుమల్ల సమీర ఎంపికైందని కాలేజ్ డైరెక్టర్ కేవీ రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు తమిళనాడు రాష్ట్రంలోని టెన్‌కాసిలో జరిగే ఏడు రాష్ట్రాల సౌత్ జోన్ చాంపియన్ షిప్‌కు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఎంపికైంది. ఈ విద్యార్థిని ఈ నెల 24 నుంచి 27 వరకు తిరుపతిలో జరిగే కోచింగ్ క్యాంప్‌లో పాల్గొని తర్వాత సౌత్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి, పీడీ, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెక్రటరీ వై శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఈ శివశంకర్, జాయింట్ సెక్రెటరీ జోనా నాయక్ అభినందనలు తెలిపారు.



రీజనల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్ విజేతలతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పలు పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ అండ్ డాన్స్ పోటీలలో యడ్లపాడు సెయింట్ ఆన్స్ హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 21, 22 తేదీలలో నంద్యాలలో రీజనల్ స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలలో సెయింట్ ఆన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. త్రోబాల్, కోకో, కబడ్డీ పోటీలలో హైస్కూల్ జట్టు రన్నరప్‌గా నిలవగా, డాన్స్ పోటీలలో జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం రోజా, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రీతిలు అభినందించారు.

జడ్పీ హైస్కూల్‌కు సౌండ్ సిస్టం బహూకరణ

యడ్లపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన సౌండ్ సిస్టంను గ్రామానికే చెందిన శ్రీరంగనాయక ట్రస్టు సభ్యులు అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.30వేల విలువైన రెండు స్పీకర్‌లు, సౌండ్ సిస్టం పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దావల వెంకయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నాగళ్ళ శ్రీకాంత్, ట్రస్ట్ సభ్యులు మద్దూరి వీరారెడ్డి, మంచా శ్రీనివాస్, గ్రామ పెద్దలు మద్దూరి విజయ బాలచంద్రారెడ్డి, పాలూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో గీతమ్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

వినుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేటలోని సాధినేని చౌదరయ్య రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ ప్రతిభా పోటీ పరీక్షలలో గీతమ్స్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై రాష్ట్రస్థాయికి ఎంపికైన వి.యశస్విని, ఏ. సోఫియా, ఎస్‌కే షారుక్‌లను అభినందించారు. ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ డిసెంబరు 22, 23 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు జరుగుతాయన్నారు.

వ్యాపారులు వాణిజ్య లైసెన్సులు పొందాలి

● మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులందరూ వాణిజ్య లైసెన్సులు పొందాలని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లాలో నరసరావుపేట పురపాలక సంఘ కమిషనర్ యం.జస్వంతరావు అధ్యక్షతన వార్డు పర్యావరణ, శానిటరీ మేస్త్రీలు, చైన్‌మెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి ఒక్కరూ కాలువలకు లోపల వైపు ఉండి తమ, తమ వ్యాపార కలాపాలు నిర్వహించుకోవాలని, వ్యాపారం నిర్వహించే వారే వారి వద్ద వెలువడే చెత్తకు పూర్తి బాధ్యత వహించి, వారి వద్ద ఉంచుకొని కేవలం మున్సిపల్ వాహనాలు, కార్మికులకు మాత్రమే అందించాలన్నారు. ఎవరైనా ప్రకటలకు సంబంధించి బోర్డులు పెట్టదల్చుకుంటే మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించి, దానికి సంబంధించిన చలానాలను కట్టిన తర్వాత మాత్రమే అడ్వర్టైజ్మెంట్ బోర్డులు, ఫ్లెక్సీలు పెట్టుకోవాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ విశాలంగా ఉండేటట్లు, ప్రజా రవాణాకు ఆటంకాలు ఏర్పడకుండా చూడాలన్నారు.